సాక్షి
ఒడిశా
మంగళవారం । 20 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 5,58,967
బంగారం: 2 గ్రాములు
వెండి: 22 గ్రాముల 300 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



గిరిజనులకు వింత వ్యాధి
బొడియా సమితిలో గిరిజనులకు వింత వ్యాధి సోకుతోంది. వారు ఆందోళన చెందుతున్నారు. - 8లో



కమిటీ పర్యటన
మహిళా శిశు సంక్షేమ కమిటీ కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తోంది. కాఫీ తోటలు సందర్శిస్తోంది. - 8లో

శ్రీ క్షేత్రంలో.. భంవురి ఉత్సవం



ఇరుసుకు చక్రాల అమరిక అనుమతి సంకేతంగా ఆజ్ఞా మాలల ఆగమనం



చొక్కా దేరా కోసం చక్రం జల శుద్ధి



మెలుకువతో ఇరుసుకు చక్రం అమరికలో భొయి కార్మికులు

● ఇరుసుకు చక్రాల అమరిక



తయారీ ప్రాంగణం నుంచి ఇరుసు అమరిక కోసం చక్రం తరలింపులో భొయి కార్మికులు



ఇరుసుకు చక్రం అమరికలో భొయి కార్మికుల సంయుక్త శ్రమ

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని రథ యాత్ర అడుగడుగునా ఆనందభరితం. అందులో రథాల తయారీ అద్భుత ఘట్టం. కలప చెక్కల సేకరణ, రవాణా మొదలుకొని రథాలు కదిలేంత వరకు ప్రతి పని సంప్రదాయబద్ధంగా కొనసాగడం శ్రీ జగన్నాథ సంస్కృతి పరిరక్షణకు అద్దం పడుతుంది. ఆధునిక యంత్ర పరికరాలు, విద్యాధిక ఇంజినీరు, సాంకేతిక నిపుణుల ప్రమేయం లేకుండా పరంపరగా కొనసాగుతున్న వడ్రంగి సేవకులు నింగిని తాకే 3 భారీ రథాలను ఏటా సకాలంలో తయారు చేసి యాత్రని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఆలయ పంచాంగ గణాంకాల ప్రకారం రథాల తయారీ దశల వారీగా నిర్ధారిత సమయంలో పూర్తి చేయడం మరో నైపుణ్యత.

భంవురి జాతర

ఏటా మాదిరిగా అక్షయ తృతీయ పురస్కరించుకుని రథాల తయారీ పనులు ప్రారంభమయ్యాయి. అదే రోజు నుంచి పవిత్ర నరేంద్ర సరోవరంలో స్వామి వెలుపలి చందన యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్ర మొదలైన 20వ రోజు నాటికి రథ చక్రాల్ని ఇరుసుకు అమర్చడం (చొక్కా దేరా) ఆలయ ఆచారాల్లో భాగం. ఈ లెక్క ప్రకారం సోమ వారం ఈ భారీ ప్రక్రియ ఆనందోత్సాహాలతో పూర్తయ్యింది. మరో వైపు నరేంద్ర సరోవరంలో సంధ్య వేళలో మదన మోహనుడు నౌకా విహారంలో భాగంగా నిరవధికంగా 21 సార్లు సరోవరం చుట్టుముట్టి ముచ్చట గొలిపించడం భంవురి యాత్రగా పేర్కొంటారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి శ్రీ క్షేత్రంలో ఉత్సవ వాతావరణం అలముకుంది. సింహ ద్వారం తలుపులు తెరిచి నిత్య, దైనందిన సంప్రదాయ పూజాదులు ముగియడంతో ప్రాతః ధూపం తర్వాత భంవురి జాతర సంబంధిత పూజాదులు ప్రారంభమయ్యాయి. శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో రథాల తయారీ శాల ప్రాంగణంలో చొక్కా దేరా ఉత్సవానికి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాటుల ఆజ్ఞతో యాత్ర అనుబంధ కార్యకలాపాలకు శ్రీకారం చుట్టడం అనివార్యం. ఈ నేపథ్యంలో 3 రథాల ఇరుసుకు చక్రాలు అమర్చేందుకు పూజా పండాల ప్రత్యక్ష పర్యవేక్షణలో మూల విరాట్ల ఆజ్ఞకు సంకేతంగా ఒక్కో ఆజ్ఞా మాల రథ తయారీ శాల ప్రాంగణానికి చేరాయి. ఆజ్ఞా మాలలు చేరే సరికి ఒక్కో రథానికి 2 చొప్పున 6 చక్రాల్ని ఎంపిక చేసి పవిత్ర జలంతో శుద్ధి చేసి సిద్ధం చేశారు. ఆజ్ఞా మాలలతో ఈ చక్రాలకు పూజాదులు నిర్వహించి 3 ఇరుసులకు అమర్చారు. దీంతో యాత్రకు జగన్నాథ రథ చక్రాలు సిద్ధమైనట్లు స్వామి భక్తజన హృదయాల్ని పులకింపజేశాయి.

భొయి సేవకులు కీలకం

చొక్కా దేరా కార్యక్రమం అత్యంత శారీరిక పరిశ్రమ, సహనం, ఓర్పుతో కూడినది. కండలు తిరిగిన వడ్రంగి సహాయ కార్మికులు (భొయి వర్గం) భారీ చక్రాల్ని పొడుగాటి ఇరుసుకు అమర్చారు. తయారీ ప్రాంగణం నుంచి రథాలు నిలిపే ఆవరణకు 3 ఇరుసులకు అమర్చేందుకు 6 చక్రాల్ని తరలించారు. ఆ ప్రాంగణంలో ఒక్కో ఇరుసుకు ఇరువైపులా ఒక్కో చక్రం అమర్చే అత్యంత కష్టతరమైన పనిని అవలీలగా ముగించారు.

ఉన్నతాధికారుల భక్తిశ్రద్ధలు

స్వామి యాత్ర నిర్వహణ పూర్వ జన్మ సుకృతంగా భావించే శ్రీ మందిరం ఉన్నత పాలన అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం ఇతరేతర అనుబంధ శాఖలు, విభాగాల ఉన్నతాధికారులు అత్యంత భక్తి శ్రద్ధలతో చొక్కా దేరా కార్యక్రమంలో ఆద్యంతం పాలుపంచుకున్నారు. యాత్ర నిర్విఘ్నంగా విజవంతం కావాలనే ఆకాంక్షతో చక్రాలకు నమస్కరించి భక్తి శ్రద్ధల్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం సింహ ద్వారం వైపు వాహనాల రాకపోకల్ని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం ప్రత్యేక ఆంక్షలు జారీ చేసింది.



నిర్విఘ్న యాత్ర కోసం నమస్కరించిన శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు డాక్టరు అరవింద కుమార్ పాఢి



రథ చక్రానికి నమస్కరించిన పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు



ఇరుసుకు అమరిన చక్రాలు

ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన చైన్‌స్నాచర్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గురండి, కాశీనగర్, పర్లాకిమిడి పట్టణంలో జనవరి మాసం నుంచి ఇప్పటివరకూ జరిగిన చైన్ స్నాచింగ్ కేసులలో నిందితుడు నవీన్ కుమార్ ఎట్టకేలకు ఆదర్శ పోలీసు అధికారుల చేతికి చిక్కాడు. ఈ వివరాలను సోమవారం ఆదర్శపోలీసు స్టేషన్‌లో ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పర్లాకిమిడి, కాశీనగర్, గురండి పోలీసు స్టేషన్ల పరిధిలోని ఏడోమైలు పరిధిలో మొత్తం ఐదు బంగారు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. వృద్ధ మహిళలే టార్గెట్‌గా వారి వెంటనే బైక్‌పై అనుసరించి నిర్జీవ ప్రాంతంలో వారి మెడలోని బంగారు చైన్లను తెంచి పారిపోవడం నవీన్ చాకచక్యంగా చేసేవాడు. నిందితుడు ఉప్పలూరి నవీన్ కుమార్ స్వగ్రామం మందస మండలం (శ్రీకాకుళం) సొండిపూడి గ్రామమని ఎస్పీ పండా తెలియజేశారు. నిందితుడు నవీన్ కుమార్ స్థానిక పెద్ద బ్రాహ్మణవీధిలో కూడా ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వస్త్రాల వ్యాపారం కూడా చేసేవాడని తెలియజేశారు. దొంగిలించిన బంగారు వస్తువులను మందస గ్రామంలో తన చెల్లెలు ఇంట్లో దాచేవాడని దర్యాప్తులో తేలిందని అన్నారు. నిందితుడు నవీన్ కుమార్‌పై పర్లాకిమిడి, గురండి పోలీసు స్టేషన్‌లోని కేసులే కాకుండా మందస, మెళియాపుట్టిలో కూడా ఉండవచ్చని పోలీసు అధికారులు తెలియజేశారు. నిందితుడి వద్ద నుంచి మొత్తం 73.15 గ్రాముల బంగారు వస్తువులు, ఒక చరవాణి, గ్లామర్ బండి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ జీఎన్ పండా తెలియజేశారు. అరెస్టయిన నిందితుడ్ని సోమవారం జిల్లా కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసి ప్రశాంత్ భూపతి, గురండి పోలీసు స్టేషన్ అధికారి ఓం నారాయన్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్పీ జీఎన్ పండా, చైన్ స్నాచర్ నిందితుడు తదితరులు



నిందితుడు ఉపయోగించిన బైక్

కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ విస్తరణ

జయపురం: ఇంతవరకు నాలుగు జిల్లాలకు ప్రాతినిథ్యం వహిస్తున్న కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ త్వరలో నాలుగు ముక్కలు కానుంది. త్వరలోనే నవరంగపూర్, రాయగడ, మల్కనగిరి జిల్లాలలో స్వతంత్ర్య కేంద్ర సహకార బ్యాంక్‌లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర సహకార మంత్రాలయం విజ్ఞప్తి మేరకు నాబార్డ్ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. ఈ విషయం రాష్ట్ర సహకార పరిచాలన కమిటీ డైరెక్టర్ సిద్ధార్థ దాస్, కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యనిర్వాహక అధికారికి లేఖ ద్వారా తెలిపారు. 1992లో అవిభక్త కొరాపుట్ నాలుగు జిల్లాలుగా విభజించినా 1950 మార్చ్ 15 వ తేదీన ఏర్పాటు చేసిన కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ (కేసీసీ బ్యాంక్)నేటి వరకు కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్‌గానే నాలుగు జిల్లాలకు ప్రాతినిథ్యం వహిస్తోంది. వాస్తవానికి 1950లో నెలకొల్పిన కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ మొదట నవరంగపూర్‌లో ఏర్పాటు చేశారు. 1972 ఆగస్టు 23న నవరంగపూర్ నుంచి జయపురానికి తరలించారు. కేసీసీ బ్యాంక్ కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నవరంగపూర్‌లలో తన శాఖలను విస్తరించారు. కొరాపుట్ జిల్లాలోని 14 సమితుల్లో 140 పంచాయతీల్లో గల 1944 గ్రామాలలో 10 కేసీసీ బ్యాంక్ శాఖలు 97 ల్యాంపులు నెలకొల్పారు. వాటిలో 1,28,988 మంది సభ్యులు ఉన్నారు. అలాగే కొత్తగా ఏర్పాటు కానున్న నవరంగపూర్ జిల్లాలో గల ఓ సమితుల్లో 111 గ్రామ పంచాయతీలలో కేసీసీ బ్యాంక్ సేవలు అందిస్తోంది. ఈ బ్యాంక్‌లో నవరంగపూర్, ఉమ్మరకోట్ ప్రజలే కాకుండా 982 గ్రామాల లో 1,07,729 మంది బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్నారు. ఈ జిల్లాలో 4 కేసీసీ బ్యాంక్ శాఖలతో పాటు 91 లేంపులు పని చేస్తున్నాయి. అదేవిధంగా మల్కన్‌గిరితో పాటు 1045 గ్రామాలలో కేసీసీ బ్యాంక్ తన సేవలు అందిస్తోంది. ఈ జిల్లాలో గల 4 బ్యాంక్ శాఖలు, 55 లేంపులలో 70,050 మంది ఖాతాదారులు ఉన్నారు. అదేవిధంగా రాయగడ జిల్లాలో రెండు పట్టణాలతో పాటు 2657 గ్రామాల్లో 5 బ్యాంక్ శాఖలు, 95 లేంపులలో 77,258 ఖాతాదారులు సేవలు పొందుతున్నారు. ఆ నాలుగు జిల్లాల బాధ్యతలను కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్, జయపురం నిర్వహిస్తోంది.



నాలుగు జిల్లాలకు స్వతంత్ర్య కేంద్ర సహకార బ్యాంక్‌లుగా ఏర్పడనున్న కేసీసీ బ్యాంక్

సమస్య.. పరిష్కారం



వృద్ధ మహిళ గోడు ఆలకించిన ముఖ్యమంత్రి



దివ్యాంగునికి ముఖ్యమంత్రి భరోసా

భువనేశ్వర్: దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్‌లో బాధిత వర్గాలు దాఖలు చేసిన ఫిర్యాదుల్ని స్వీకరించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం 11వ ఫిర్యాదు విచారణ కార్యక్రమం జయప్రదమైంది. ఈ విడతలో ఆన్‌లైన్‌లో 1,000 మంది బాధితులు ఫిర్యాదులు నమోదు చేశారు. ముఖ్యమంత్రితో పాటు ఆరుగురు సీనియర్ మంత్రులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుని ఫిర్యాదులను పరిష్కరించారు. అదనపు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శి స్థాయి అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగిల్ విండో వ్యవస్థ ద్వారా 14 మంది వ్యక్తులకు రూ. 13.50 లక్షలు సహాయం అందజేశారు. మీడియాతో మాట్లాడుతూ ఫిర్యాదుల విచారణ కార్యక్రమంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలతో ముందుకు వస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం ద్వారా ప్రభుత్వం నిరంతర న్యాయం అందించడానికి కట్టుబడి ఉంది. ప్రభుత్వం నిరంతరం ఫిర్యాదులను వింటోంది. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది, ముఖ్యంగా పేదలు, నిస్సహాయులకు సహాయం చేయడానికి త్వరలో ఫిర్యాదుల విచారణ శిబిరాలు ప్రాంతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

భువనేశ్వర్‌లో త్వరలో ఎన్ఐఏ శాఖ ఏర్పాటు

భువనేశ్వర్: ప్రతిష్టాత్మక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శాఖను త్వరలో ఒడిశాలో ఏర్పా టు చేయనున్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత స్థానిక వీఎస్ఎస్ నగర్‌లో ఈ శాఖ కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. పోలీసు సూపరింటెండెంటు హోదాతో సమానమైన స్థాయి అధికారిని ఈ శాఖ అధిపతిగా నియమిస్తారు. ఎన్ఐఏ శాఖ ఒడిశాలో నేర, ఉగ్రవాద కార్యకలాపాలను త్వరగా దర్యాప్తు చేయడంలో సహాయపడుతుంది. ప్రస్తుతం ఢిల్లీ, హైదరాబాద్, గౌహతి, కొచ్చి, లక్నో, ముంబై, కోల్‌కతా, రాయ్‌పూర్, జమ్మూ, చండీగఢ్, రాంచీ, చెన్నై, ఇంఫాల్, బెంగళూరు, పాట్నాలలో జాతీయ దర్యాప్తు సంస్థ 15 శాఖలను కలిగి ఉంది.

పింక్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు



హెల్ప్ డెస్క్

భువనేశ్వర్: మహిళా యాత్రికులు, భక్తుల భద్రత, రక్షణ, మద్దతు, ఆపద సమయంలో పోలీసులు ఆసరాగా నిలిచేందుకు పింక్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. శ్రీ జగన్నాథ ఆలయం ఉత్తర ద్వారం వద్ద ఈ కేంద్రం పని చేస్తుంది. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు ఈ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.

విశాల్ మెగా మార్ట్‌కు రూ. లక్ష జరిమానా



విశాల్ మెగా మార్ట్



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: స్థానిక ఎఫ్‌సీఐ సమీపంలోని విశాల్ మేగా మార్ట్ షోరూంలో సోమవారం ఫుడ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి ప్రకాష్ సోరేన్ నేతృత్వంలో ఆ శాఖకు చెందిన మరో ఇద్దరు అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. వస్తువుల కాలవ్యవధి పూర్తయినప్పటికీ వాటిని విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఒక లక్ష రూపాయలను జరిమానాగా విధించారు. వివరాల ప్రకారం.. సంగ్రామ్ పట్నాయక్ అనే వినియోగదారుడు ఈ నెల 14వ తేదీన విశాల్ మేగా మార్ట్‌లో 1463 రూపాయల విలువైన వస్తువులను కొనుగోలు చేశాడు. ఇందులో భుజియ (మిక్చర్) ప్యాకట్ కాల వ్యవధి పూర్తయినట్టు గుర్తించి విషయాన్ని వెంటనే మేగా మార్ట్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లాడు. అయితే ఈ వస్తువు తమ వద్ద లేదని.. కాలవ్యవధి పూర్తయిన వస్తువులు తమ మార్ట్‌లో విక్రయించడం లేదని దురుసుగా సమాధానం చెప్పాడు. దీంతో పట్నాయక్ స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిని పరిగణలోకి తీసుకున్న అధికారులు ఈ మేరకు తనిఖీలు నిర్వహించి మేగా మార్ట్ నిర్లక్ష్యాన్ని తప్పుబడుతూ జరిమానా విధించారు. తనిఖీలు నిర్వహించిన సమయంలో కొన్ని కాలపరిమితి అయిన వస్తువులను సీజ్ చేసిన అధికారులు వాటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు.

న్యూస్‌రీల్

బీజేపీ పటిష్టతకు కృషి



పార్టీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న మాఝి తదితరులు

రాయగడ: జిల్లాలో బీజేపీ పటిష్టతకు నాయకులు కృషి చేస్తున్నారు. ఈ మేరకు సమితి స్థాయిలో సమావేశాలను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో కళ్యాణసింగుపూర్ సమితి బుడాగుడ పంచాయతీలోని కుంభారిగుడలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని అన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేడీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణ సింగుపూర్ మండల శాఖ అధ్యక్షుడు అజిత్ పాణిగ్రాహి, సహదేవ్ జాని తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్ మున్సిపల్ కార్యాలయానికి తాళాలు



కొరాపుట్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు

కొరాపుట్: కొరాపుట్ మున్సిపల్ కార్యాలయానికి కౌన్సిలర్లు స్వయంగా తాళాలు వేశారు. సోమవారం కార్యాలయ పని వేళల్లో పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు అందరూ చేరుకుని ప్రధాన మార్గానికి తాళాలు వేశారు. జిల్లా కేంద్రంలో ముఖ్యమైన మున్సిపల్ కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. ఇలాటి ముఖ్యమైన పోస్టును ఇన్‌చార్జిలతో ప్రభుత్వం నడిపిస్తోంది. దీని వల్ల పనులు ముందుకు సాగడం లేదు. దీనిపై పలుమార్లు కౌన్సిలర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. చివరకు కౌన్సిలర్లు స్వయంగా తాళాలు వేసి నిరసనకి దిగారు.

ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు

భువనేశ్వర్: రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ కోసం ప్రతిపాదించి ప్రవేశ పెట్టిన పథకాల అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత విభాగం మంత్రి అధ్యక్షతన 12 మంది సభ్యులతో ఈ బోర్డు కార్యకలాపాలు కొనసాగిస్తుంది. రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల పునరావాసం, సంక్షేమం కోసం సమగ్ర మార్గదర్శకాల రూపకల్పన, ఉత్తమ ప్రయోజనాల పరిరక్షణ ఈ బోర్డు ప్రధాన కార్యాచరణగా దివ్యాంగుల సామాజిక భద్రత, సాధికారత శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు సభ్యులు

దివ్యాంగుల సామాజిక భద్రత, సాధికారత విభాగం మంత్రి అధ్యక్షుడు, విభాగం కార్యదర్శి ఉపాధ్యక్షుడు, డైరెక్టర్ మెంబరు కార్యదర్శి, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం, పంచాయతీ రాజ్-తాగు నీరు, గృహ నిర్మాణం-పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి-సాంకేతిక విద్య, ఉన్నత విద్య, పాఠశాలలు-సామూహిక విద్య శాఖల నుంచి ఒక్కో ప్రతినిధి, జిల్లా కలెక్టర్ల వర్గం నుంచి ముగ్గురు, రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌జెండర్ వర్గం నుంచి ఇద్దరు, సంఘ సంస్కర్తల వర్గం నుంచి 2 మంది చొప్పున ప్రతినిధులు బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తారు. త్రైవార్షిక ప్రాతిపదికన రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ (టీజీ) సంక్షేమ బోర్డు పని చేస్తుంది.

టీజీ అభ్యర్థుల కనీస అర్హతలు

- జిల్లా స్థాయిలో నమోదు ఆధారిత గుర్తింపు కార్డు పొంది ఉండాలి.
- వయసు 25 సంవత్సరాలు పైబడాలి.
- గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణత.
- టీజీ వర్గంతో కనీసం 5 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

తాగునీటి సమస్యపై వినతి

జయపురం: తాము తాగునీటికి కటకటలాడుతున్నామని తమ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి కాతపాడ గ్రామ పంచాయతీ గదబగుడ గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. బొయిపరిగుడ బీడీఓ కార్యాలయానికి వచ్చి మెమోరాండం సమర్పించారు. బీడీఓ లేక పోవటంతో అదనపు బీడీఓ నివేదిత దండసేనకు అందజేశారు. 200 కుటుంబాలకు రెండే బావులు ఉన్నాయని, అందులోనూ ఒకటి పాడైపోయిందని తెలిపారు. వేసవిలో తాగు నీటి వసతి కల్పించాలని కోరారు.

క్లుప్తంగా

పోడియా సమితిలో గిరిజనులకు వింత వ్యాధి



ఆరోగ్య కేంద్రంలో ఇచ్చిన మందుల చీటీతో వింత వ్యాధి బాధితులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి క్రిస్టియన్ వీధి, డైలీ మార్కెట్, శాంతి నగర్ వీధుల్లో నివసిస్తున్న గిరిజనులు నెల రోజులుగా వింత వ్యాధితో బాధ పడుతున్నారు. ఈ వ్యాధి మొదట చిన్న పిల్లల్లో కనిపించింది. పిల్లలకు కడుపు నొప్పి, చేతులు, కాళ్లు, ముఖం వాచిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పోడియా ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మందులు వేసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ వాపుల వల్ల చాలా మంది నడవలేకపోతున్నారు. శరీరం కూడా నలుపు రంగులోకి మారిపోతోంది. దీనిపై కొందరు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ప్రత్యేక బృందాన్ని పంపిస్తానని ఆయన తెలిపారు.

ఆరేళ్లకే ఆయువు తీరింది




యువంత్(ఫైల్)

పొందూరు: పొందూరు–చిలకపాలెం రహదారిలోని ఎరుకులపేట కూడలి వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనం ఢీకొని ఆరేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం గోకర్నపల్లి పంచాయతీ రంగనాథపేట గ్రామానికి చెందిన పేడాడ హరిబాబు, ఈశ్వరమ్మ దంపతులకు వెంకటసూర్య యువంత్(6) అనే కుమారుడు ఉన్నాడు. యువంత్ తల్లిదండ్రులతో కలిసి ఎరుకులపేటలో చిన్న తాతయ్యను చూసేందుకు వచ్చాడు. అక్కడి నుంచి చిలకపాలెం వెళ్లేందుకు తల్లిదండ్రులతో కలిసి ఎరుకులపేట బస్టాప్‌కు బయలుదేరాడు. బస్టాప్ నుంచి రహదారి అవతలవైపు ఆటో ఆపేందుకు తండ్రి హరిబాబు వెళ్లాడు. తండ్రి దగ్గరకు వెళ్లాలనే ఆతృతతో తల్లి ఈశ్వరమ్మ చేయిని వదిలి బాలుడు పరిగెత్తుకుంటూ రోడ్డుపైకి వెళ్లాడు. అదే సమయంలో చిలకపాలెం నుంచి పొందూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం బాలుడిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడిని పొందూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్ లేకపోవడంతో 108 వాహనంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యసిబ్బంది సూచించారు. అక్కడికి వెళ్తుండగా మార్గమధ్యలోనే బాలుడు మృతి చెందాడు. తండ్రి హరిబాబు విశాఖపట్నంలోని ప్రైవేటు కళాశాలలో పనిచేస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కాగా, బాలుడి మృతితో రంగనాథపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నరసన్నపేట: కోమర్తి వద్ద జాతీయ రహదారి ఫ్లై ఓవరుపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి ఏమీ చెప్పలేని స్థితిలో ఉండటంతో మృతుడి పూర్తి వివరాలు తెలియలేదు. నరసన్నపేట వైపు నుంచి శ్రీకాకుళం వెళ్లే దారిలో వీరి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు ప్రమాద సంఘటన బట్టి పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదే ప్రదేశంలో వద్ద ఇసుక ఉండటంతో ఇసుక ట్రాక్టర్ ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనంపై ఓడీ 33ఏ డీ2053 నంబరు ఉంది. దీంతో ప్రమాదానికి గురైన వారు ఒడిశావాసులుగా పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

సర్పాల సయ్యాట



పొందూరు రూరల్ : మండల కేంద్రం పొందూరులోని అఫీషియల్ కాలనీలో రిటైర్డ్ ఉద్యోగి బేత కృష్ణారావు ఇంటి పక్కన సోమవారం సాయంత్రం నాగుపాము, జెర్రిపోతులు సయ్యాట ఆడాయి. ఒక్కసారిగా పాములు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ఒడియా చలన చిత్ర రంగం

బలోపేతానికి సన్నాహాలు



సిద్ధాంత మహాపాత్రో అధ్యక్షతన చలన చిత్ర రంగం వాటాదారుల సమావేశం

భువనేశ్వర్:

ఒడియా చలన చిత్రం రంగాన్ని బలోపేతం చేసేందుకు సంబంధిత వాటాదారులు సమావేశమయ్యారు. స్థానిక సంస్కృత భవన్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. ప్రముఖ ఒడియా చలన చిత్ర నటుడు, దిగొపొహండి నియోజక వర్గం ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. చలన చిత్ర నిర్మాతలు, దర్శకులు, నటులు, నటీమణులు, రచయితలు, సంగీతకారులు సహా చలన చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఒడియా సినిమా రంగం వృద్ధి, మెరుగుదలపై వీరంతా పలు అభిప్రాయాలు వ్యక్తీకరించారు. ఒడిశా రాష్ట్ర చలనచిత్ర అవార్డుల వార్షిక ప్రధానోత్సవాన్ని సకాలంలో నిర్వహించడం సినీ రంగం కళాకారుల్ని ఉత్సాహపరుస్తుంది. నగదు పురస్కారాల పరిధి, 33 అవార్డు విభాగాల విస్తరణతో చలన చిత్ర రంగం కళాకారులకు ప్రోత్సహిస్తుందన్నారు. కొత్త చలనచిత్ర విధానాన్ని రూపొందించి చలన చిత్ర నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయడంతో చలన చిత్ర నిర్మాణానికి ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఒడిశా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పనితీరును బలోపేతం చేసి కళింగ స్టూడియో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో సినిమా హాళ్ల సంఖ్యను పెంచి ప్రేక్షకులకు సరసమైన ధరలకు టికెట్లు అందించాలని అభ్యర్థించారు. ప్రఖ్యాత సినీ నటులు అరిందమ్ రాయ్, శ్రితమ్ దాస్, సబ్యసాచి మిశ్రా, హరిహర్ మహాపాత్రో, నటి అర్పితా సాహు, పింకీ ప్రధాన్, అను చౌదరి, సంగీత విద్వాంసుడు దేబాశిష్ మహాపాత్రో, పంచానన్ నాయక్, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ దీప్తి మిశ్రా, ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక శాఖ డిప్యూటీ కార్యదర్శి, దివ్య ప్రసాద్, సాహిత్యం, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ దేవయాని భుయ్యా, ఒడిశా సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ చంద్ర శేఖర్ హొత్తా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్‌కు విశేష స్పందన



రాయగడ: చంద్రపూర్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు



పర్లాకిమిడి: స్పందన కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు



మల్కన్‌గిరి: అధికారులకు వినతులు అందజేస్తున్న ప్రజలు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక సమితి కార్యాలయం సమావేశ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ చంద్ర నాయక్ అధ్యక్షతన వినతులు స్వీకరించారు. మొత్తం 15 వినతులు వచ్చాయి. వీటిలో ఎనిమిది వ్యక్తి గత.. ఏడు గ్రామసమస్యలుగా అధికారులు గుర్తించారు. స్వీకరించిన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని నాయక్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అజయ్‌కుమార్ ప్రధాన్, ఆర్డీవో శివ శంకర్ చౌదరి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆసీమా రావ్ పాల్గొన్నారు.

పి.అంతరాడలో..

పర్లాకిమిడి: జిల్లాలోని నువాగడ బ్లాక్ పి.అంతరాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జాయింట్ గ్రీవెన్సు సెల్‌కు జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ హాజరయ్యారు. ఆయనతో పాటు జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, నువాగడ బ్లాక్ అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్ హాజరయ్యారు. స్పందన కార్యక్రమంలో కెరడంగా, నువాగడ, లుహాంగర్, అంతరాడ నుంచి 46 అభియోగాలు వచ్చాయి. అందులో నాలుగింటిని అధికారులు పరిష్కరించారు. గ్రామసమస్యలపై వచ్చిన 33 వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బీడీవో లోకనాథ్ శోబోరో, తహసీల్దార్ మోనాలిసా ఆచారి, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.ఆలీ, జిల్లా సామాజిక సురక్షా, దివ్యాంగుల స్వశక్తీకరణ అధికారి సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

కలిమెల సమితిలో 27 వినతుల స్వీకరణ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితిలో జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్రసభరో నేతృత్వంలో గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై 27 మంది వినతులను అందజేశారు. వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మైదానం అభివృద్ధికి వినతి



మంత్రి సూర్యవంశీ సూరజ్‌కు వినతిని అందజేస్తున్న ఎంపీ ప్రతినిధి దారపు చిట్టి

పర్లాకిమిడి: స్థానిక శ్రీక్రిష్ణచంద్రగజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల మైదానం అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గజపతి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇదివరకు సమర్పించారు. దీనిపై 'సాక్షి'తో పాటు అనేక పత్రికల్లో కళాశాల మైదానం దీనస్థితిపై కథనాలు వచ్చాయి. ప్రస్తుత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ, క్రీడలు, యువజన సర్వీసుల మంత్రి సూర్య వంశీ సూరజ్‌కు లేఖ రాశారు. మహారాజా కళాశాల ఒడిశాలో హెరిటేజ్ భవనం అని, ఇక్కడ స్పోర్ట్స్ మైదానం అభివృద్ధి చేసి అన్ని సౌకర్యాలు క్రీడాకారులకు కల్పించాలని కోరుతూ రాసిన వినతిని ఎంపీ ప్రతినిధి దారపు రాజేష్‌కుమార్ (చిట్టి) భువనేశ్వర్‌లో మంత్రి సూర్యవంశీ సూరజ్‌కు అందజేసినట్టు తెలియజేశారు. దీనిపై డీఆర్‌డీఏ శాఖ రూ.95 లక్షలతో ప్రతిపాదనలు డైరెక్టర్ ఉన్నత విద్యాశాఖకు పంపించారు.

లారీ డ్రైవర్లపై దాడి

- నగదు, సెల్‌ఫోన్లతో పరారైన దుండగులు
- పెద్ద తామరాపల్లిలో అర్ధరాత్రి అలజడి



డ్రైవర్లపై విసిరిన రాళ్లు (ఇన్‌సెట్లో) దాడిలో గాయపడిన లారీ డ్రైవర్ సుజిత్‌కుమార్‌రాయ్

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లి జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి అలజడి నెలకొంది. లారీలు ఆపి నిద్రిస్తున్న డ్రైవర్లుపై కొంతమంది దాడి చేసి అలజడి సృష్టించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సుజిత్‌కుమార్‌రాయ్, అమర్‌జీత్ చౌహాన్, పురుషోత్తంసింగ్, విజయ్‌కుమార్ యాదవ్‌లు చెన్నై నుంచి కోలకత్తా మార్గంలో వెళ్తూ ఆదివారం రాత్రి 9 గంటలకు నందిగాం మండలం పెద్దతామరాపల్లి వద్ద ఉన్న డాబా వద్ద ఆగారు. లారీలను సర్వీస్ రోడ్డువైపు పార్కింగ్ చేసి భోజనాలు అనంతరం తమ లారీల్లో నిద్రపోయారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఐదుగురు వ్యక్తులు మొదటగా విజయ్‌కుమార్ యాదవ్‌ను లేపి కత్తి చూపించి బెదిరించారు. సకాలంలో అప్రమత్తమైన విజయ్‌కుమార్ ఒక్కసారిగా లారీ స్టార్ట్ చేసి వెళ్లిపోయాడు. తర్వాత సుజిత్‌కుమార్ రాయ్, అమర్‌జీత్ చౌహాన్, పురుషోత్తం సింగ్‌లను లేపి రాళ్లతో లారీ అద్దాలు పగులగొట్టి దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొట్టి కత్తితో బెదిరించి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, రూ.28వేలు నగదు లాక్కొని తామరాపల్లి వైపు పొలాల గుండా వెళ్లిపోయారు. అనంతరం డ్రైవర్లు కేకలు వేయడంతో డాబా సిబ్బంది వచ్చి గాయాలపాలైన వారిని టెక్కలి ఆసుపత్రికి తరలించారు. దాడి లో పాల్గొన్న వారంతా తెలుగు, హిందీ మాట్లాడుతున్నారని, అందరూ 30 ఏళ్లలోపు వారేనని బాధితులు చెబుతున్నారు. అనంతరం నందిగాం పోలీసులకు సమాచారం అందించారు.



దుండగుల దాడిలో పగిలిన లారీ అద్దాలు

వాహనదారుడినీ వదల్లేదు..

నందిగాం: సుభద్రాపురం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి మూత్ర విసర్జన కోసం బైక్ ఆపి ఉండగా కొంతమంది దాడి చేశారు. తన వద్ద ఉన్న డబ్బులు తీసుకొని వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

పెట్రోల్ అపహరణ..

నందిగాం మండలంలోని సుభద్రాపురం పరిధి గుండా వెళ్తున్న ఐటీసీఎల్ పైపులైన్ నుంచి కొంత మంది పెట్రోల్ దొంగతనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పైపులైన్‌కు ఉండే ఓపెన్‌లో చిన్న పాటి మోటార్ ఇంజన్ పెట్టి పెట్రోల్ తోడేసినట్లు తెలుస్తోంది. దీనిపై నందిగాం పోలీసులకు ఫిర్యాదు అందగా హెచ్‌సీ రమణ కేసు నమోదు చేశారు. గతంలో కాశీరాజుకాశీపురం వద్ద ఇలాగే పెట్రోల్ చోరీ జరిగినట్లు సమాచారం. ప్రశాంతంగా ఉండే నందిగాం మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు ఘోరంగా వైఫల్యం చెందాయని, లా అండ్ ఆర్డర్, పోలీస్ వ్యవస్థ తీరుకు తాజా ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

సరుబుజ్జిలి: మండలంలోని కూనజమ్మన్నపేటకు చెందిన రోజువారీ కూలీ హనుమంతు వెంకటరావు(60) అనుమానాస్పదంగా మృతిచెందాడు. వెంకటరావు ఎప్పటిలాగానే ఆదివారం సరుబుజ్జిలి కూలీ పనులకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో ఎదురు చూస్తున్న సమయంలో సరుబుజ్జిలికి చెందిన ఓ వ్యక్తి సమాచారం ఇస్తూ సరుబుజ్జిలి, కూనజమ్మన్నపేట గ్రామాల మధ్య రహదారి పక్కన వెంకటరావు పడి ఉన్నట్లు చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు సాయంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోస్టుమార్టమ్ నిర్వహించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై బి.హైమావతి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళ్లబద్ర ఎల్‌సీ గేటు సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 55 ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాలు తెలిసిన వారు కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని సీఐ సూర్యనారాయణ తెలిపారు.

మహిళా శిశు సంక్షేమ కమిటీ పర్యటన



మహిళా శిశు సంక్షేమ గృహ కమిటీ సభ్యులతో జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: తొమ్మిది మంది సభ్యులతో కూడిన మహిళా, శిశు సంక్షేమ హౌస్ కమిటీ కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తోంది. శాసన సభ్యురాలు మహిళా, శిశు గృహ కమిటీ అధ్యక్షురాలు సీమారాణి నాయిక్ నేతృత్వంలో రెండు దినాల పర్యటన నిమిత్తం వచ్చిన కమిటీకి జయపురం విమానాశ్రయంలో కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ శర్మ, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, జయపురం సబ్ కలెక్టర్ శౌశ్య రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. సీమా రాణి నాయిక్ నేతృత్వంలో శాసన సభ్యులు ప్రమీళ మల్లిక్, బర్షా సింగ్ బారిహ, సుజాత సాహు, సంజలి ముర్ము, ఉపాసన మహాపాత్రో, సుభాషిని జెన, మనోరమ మహంతి, షోఫియ ఫిర్దౌస్ అధికారులతో మాట్లాడారు. వారు తమ పర్యటనలో దుదారి లోగల కాఫీ తోటలు, మండియ(ఛోళ్లు) ప్రోసెసింగ్ యూనిట్‌లను పర్యటించి స్వయం సహాయక గ్రూపు మహిళా సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కమిటీ సభ్యులు దేవమాళీ పర్వత పర్యాటక ప్రాంతంలో విడిది చేశారు.

జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పనులపై సమీక్ష



సాగర్ పునరుద్ధరణ పనులపై సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే బాహిణీ పతి



కాంట్రాక్టర్ సిబ్బంది, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురంలో చారిత్రక జగన్నాథ సాగర్ పునరుద్ధరణ పనులు ప్రారంభం కావటంతో ఆ పనులను జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి సోమవారం సమీక్షించారు. ప్రభుత్వ అధికారి, సాగర్‌లో మట్టి, బురద వెలికి తీసే కాంట్రాక్టర్లతో బాహిణీ పతి చర్చించారు. వర్షాకాలంలో కూడా పునరుద్ధరణ పనులు జరగాలని ఆయన కాంట్రాక్ట్ కంపెనీకి స్పష్టం చేశారు. సాగర్‌లో బురద పిచ్చి మొక్కలు తొలగించేందుకు ఢిల్లీ నుంచి ఒక ప్రత్యేక వాహనం రప్పిస్తామని ఆయన వెల్లడించారు. బురద తీసే సమయం రాత్రి 9 గంటల వరకు ఉండగా ఆ సమయాన్ని 12 గంటల వరకు కొనసాగించాలని ఆదేశించారు. జగన్నాథ్ సాగర్‌ను రాష్ట్రంలోనే ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని ఆయన వెల్లడించారు. రెండోసారి పునరుద్ధరణ పనుల కోసం 9 కోట్ల 45 లక్షలు వ్యయపు అంచనాను ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. సాగర్ పునరుద్ధరణ పనులు 45 రోజుల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ సంస్థ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ పనులను ఆర్ అండ్ బి ఇంజనీర్, మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్, మున్సిపాలిటీ ఇంజనీర్లు పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అక్కవరం శౌశ్యా రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, అదనపు కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, ఇంజనీర్ అజయ కుమార్ జానీ, జూనియర్ ఇంజనీర్ ప్రతాప్ చంద్ర ఆచార్య, మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్ సుప్రభ కువార్, ఆర్ అండ్ బి ఇంజనీర్ విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కళ కరాటే స్కూల్‌కు పతకాల పంట



పతకాలు సాధించిన ఉత్కళ కరాటే స్కూల్ విద్యార్థులు

జయపురం: భువనేశ్వర్‌లో ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొరాపుట్ జిల్లా సెమిలిగుడ ఉత్కళ కరాటే స్కూల్ విద్యార్థులు పతకాల పంట పండించారు. ఆ స్కూల్‌కు 19 పతకాలు లభించాయి. వాటిలో ఐదు బంగారు, తొమ్మిది వెండి, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయని పాఠశాల ప్రతినిధుల వెల్లడించారు. రుద్రాంశ కుమార్ శామల్ రెండు బంగారు, ఆకాంశ్య ప్రధాన్, దీప్తి నామదేవ్, తపశ్వినీ నాయిక్‌లు చేరో ఒక బంగారు పతకాలు సాధించారు. ఏంజిల్ అభిశిక్త మినియాక, శిబప్రతి చందన నాయిక్, నందినీ నాయిక్, తృప్తి రాణీ మహంతి, శుభమ్ నాయిక్, తపశ్వినీ, శృతి శిఖా సాహు, తృప్తి సంపూర్ణ దాస్ వెండి, అంకిత ఖోర,విద్యాశ్రీ నివేదిత మల్లిక్,శృతి, ఆకాంశ్య పటి, సంపూర్ణ కాంస్య పతకాలు సాధించారన్నారు. కొరాపుట్ జిల్లా కరాటే అసోసియేషన్, సెమిలిగుడ కరాటే స్కూలు నిర్వాహకులు, కరాటే అభిమానులు విజేతలకు అభినందించారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తి సంగీత, నృత్య ప్రదర్శన



బృందావనం ఇస్కాన్ నుంచి విచ్చేసిన పాదప్రతాప్ రుద్రదాస్, పంచరత్నదాస్‌లు



రాధాకృష్ణుల వేషాధారణలో డ్యాన్స్ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక డెప్పో ఒడియా వీధి నామహట్టో కేంద్రం తరఫున ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకూ సమ్మర్ క్యాంపు ఇస్కాన్ ఆధ్వర్యంలో టౌన్ హాల్‌లో నిర్వహించారు. ముగింపు సమావేశంలో బృందావనం నుంచి విచ్చేసిన కృష్ణ భక్తులు పాద ప్రతాప్ రుద్రదాస్, ఇస్కాన్ ప్రభు పాద పంచరత్న దాస్‌లు ఆదివారం విచ్చేశారు. ముఖ్యఅతిథిగా పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి విచ్చేశారు. ఒకటి నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలు ఆధ్యాత్మిక సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. సుమారు 300 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ఇచ్ఛాపురం టౌన్ : ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో కిడ్నీ రోగుల కోసం వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. డయాలసిస్ గదితో పాటు తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్, స్టెమీ యూనిట్, అత్యవసర రోగుల యూనిట్, ల్యాబ్‌లను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్దానంలో కిడ్నీ బాధితుల కోసం గత వైఎస్సార్ సీపీ పాలనలోనే రూ.ఏడు వందల కోట్లతో తాగునీటి పథకం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డీసీహెచ్ కళ్యాణ్ బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులకు ఇప్పటి వరకు విశాఖ కేజీహెచ్‌లోనే ప్రత్యేక వైద్యసేవలు అందించే వారని, ఇకపై ఇచ్ఛాపురంలోనూ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కవిటిలో డయాలసిస్ కోసం 20 బెడ్లు, సోంపేటలో 19 ఉండగా అదనంగా మరో 3 బెడ్లు పెంచినట్లు చెప్పారు. పలాసలో 20 బెడ్లు ఉండగా మరో 10 పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్ర రెడ్డి, దాసరి రాజు, ఎన్.కోటి, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అగ్నిగంగమ్మకు అధికారుల పూజలు

అగ్నిగంగమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. ఇందులో భాగంగా కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని అగ్ని గంగమ్మ అమ్మవారిని కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మలు సోమవారం దర్శించుకున్నారు. వైభవంగా జరుగుతున్న అమ్మవారి సంబరాలను పరిశీలించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులను సత్కరించారు.
–కొరాపుట్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఉన్నతాధికారులు



కమిటీ సభ్యులతో కలెక్టర్, ఎస్పీలు

క్లుప్తంగా

పింఛన్ పెంచండి సారూ

• కలెక్టర్‌కు వేడుకోలు



కుటుంబ సభ్యుల సాయంతో కలెక్టరేట్‌కు వచ్చిన సవర సోయయ్య



ఒంటికాలితో కలెక్టరేట్‌కు వచ్చిన లోకేష్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వంలో పింఛన్ దారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సోమవారం వస్తేచాలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు కలెక్టర్ కార్యాలయానికి నడవలేని పరిస్థితుల్లో కుటుంబసభ్యుల సహాయంతో దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. కొంత మందికి అర్హత ఉన్నా పింఛన్ రావడం లేదని, మరికొంతమందికి 90శాతం దాటి వైకల్యం ఉన్నా కేవలం రూ.6వేలే పింఛన్ ఇస్తున్నారని, తమ సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

స్టేట్‌లెవెల్ కరాటే చాంపియన్ షిప్‌కు రాజాం విద్యార్థులు



ప్రతిభకనబర్చిన విద్యార్థులతో నిర్వాహకులు

రాజాం సిటీ: త్వరలో జరగనున్న స్టేట్‌లెవెల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు రాజాంలోని శివసైన్యం కరాటే విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ ఆర్.శివ సోమవారం తెలిపారు. ఈ నెల 18న విజయనగరంలోని రాజీవ్ ఇండోర్‌స్టేడియంలో జరిగిన పోటీల్లో కుమిటీ విభాగంలో వి.రిషిక (ప్రథమస్థానం), కాటా విభాగంలో వి.మోహిత్ (ద్వితీయ స్థానం), కె.మహేష్ (మూడో స్థానం)లో నిలిచి ఈ ఘనత సాధించారన్నారు. విద్యార్థుల ప్రతిభను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

గిరిజనవర్సిటీలో ఆదివాసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

• ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఆదివాసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో ఆదివాసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. గిరిజన యూనివర్సిటీలో ఆదివాసీలకు కేటాయించిన సీట్ల శాతం ఇతర యూనివర్సిటీల మాదిరిగానే 75 శాతం మాత్రమే ఉందన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ ప్రధానంగా ఆదివాసీ అధ్యయనాలు, ఆదివాసీ కేంద్రిత అంశాలు, పరిశోధనల కోసం ఏర్పాటు చేశారని అందువల్ల ఆదివాసీలకు మరింత ఎక్కువ సీట్లను రిజర్వ్ చేయాలని లేఖలో కోరారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి భాస్కరరావు(27)అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు భాస్కరరావు గ్రామంలో డబ్బులు అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు అడగడంతో మనస్తాపం చెంది సోమవారం ఉదయం ఇంటిలో ఇనుపరాడ్డుకు బెడ్‌షీట్‌ను కట్టి ఉరివేసుకున్నాడు. ఈ మేరకు గరివిడి ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వంతో సమస్యలు పరిష్కరించాలి

• కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను మానవతా దృక్పథంతో ఆలోచన చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆయన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి 108 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా, రెవెన్యూ అధికారి కె. హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ డా.పి.ధర్మచంద్రా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యులయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్య పరిష్కరం ఏ దిశలో ఉందో సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా అర్జీదారుకు తెలియజేయనున్నట్లు తెలిపారు. కావున అర్జీల పరిష్కార ప్రక్రియలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌లో అందిన కొన్ని వినతులు

- పార్వతీపురం మండలం జగన్నాథపురం గ్రామ యువత పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యేలా అవసరమైన పుస్తకాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్.ప్రవీణ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.
- పాచిపెంట మండలం గంగన్న దొరకోనవలస గ్రామానికి ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ గ్రామసర్పంచ్, ఎంపీడీఓ అనుమతులు మంజూరు చేయడం లేదని, కావున అనుమతులు మంజూరుపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు విన్నవించారు.



పార్వతీపురం టౌన్: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- తోటపల్లి రిజర్వాయర్‌లో బోటింగ్ పాయింట్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి కల్పించాలని జి.చిరంజీవి, తోట ప్రసాద్, అల్లు సురేష్, సమ్మిడి రాజేష్ వినతిపత్రం అందజేశారు.
- కొమరాడ మండలం అర్తాం రెవెన్యూ పరిధిలోని 0.3 ఎకరాల కొండ పోరంబోకు భూమిని సాగు చేసుకుంటున్నామని, ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాన్ని మంజూరు చేయాలని కోరుతూ కె. కృష్ణందొర వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలైతే చట్టపరిధిలో చర్యలు

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల దర్యాప్తులో వాస్తవాలు అయినట్లయితే చట్టపరిధిలో తక్షణమే చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదు దారుల నుంచి స్వయంగా సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధించిన స్టేషన్ అధికారులకు సిఫార్సు చేయనున్నామని, ఆయా అధికారులు ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరమైన చర్యలతో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ సిబ్బందికి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, భర్త, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూలు, ప్రేమ పేరుతో మోసాలపై పలు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. కార్యక్రమంలో 6 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. డీసీఆర్‌బీ ఎస్ఐ ఫక్రుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 46 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 46 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పుబ్బాడ గ్రామస్తులు పద్మ గ్రామానికి సీసీ రోడ్డు వేయాలని కోరారు. రెల్లిగూడకు చెందిన బంగారమ్మ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, వరదగోడ తన గ్రామంలో నిర్మించాలని రాజమానుగూడకు చెందిన సవర చిన్నారావు విజ్ఞప్తి చేశారు. సవర నవీన్ వన్‌బీ అడంగల్ ఇప్పించాలని కోరారు. తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని కుంబికి చెందిన రామారావు వినతి అందజేశారు. వీధికాలువలు నిర్మించాలని మెట్టుగూడ గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్వీ గణేష్, ఏఎంఓ కోటిబాబు, పీఆర్ ఏఈ కిరణ్, సీడీపీఓ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలి

• కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్
• పీజీఆర్ఎస్‌కు 154 వినతులు

విజయనగరం అర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.సెలవు కోసం ఫోన్‌లో మెసేజ్ పెట్టే వారికి షోకాజ్ నోటీసు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. సెలవు కావాల్సిన వారు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇకపై ప్రతి శనివారం సాయంత్రం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజా వినతుల పరిష్కా వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడంలో సహకరించాడానికి కలెక్టరేట్ నుంచి ఇద్దరు సిబ్బందిని వచ్చే సోమవారం నుంచి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ తెలిపారు. నిరక్షరాస్యులైన వారు తమ అర్జీలను రాయడానికి దళారీలను ఆశ్రయిస్తున్నారని వారు అర్జీదారులను మభ్యపెట్టి వారి నుంచి డబ్బు తీసుకొని ప్రతి వారం కలెక్టరేట్ చుట్టు తిరిగేలా చేస్తున్నారని తెలిపారు. ఇకపై అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని జిరాక్స్ కేంద్రాల్లో రాయించవద్దని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలని కలెక్టరేట్ సూచించారు. అర్జీలు రాయడానికి డబ్బులు ఇచ్చిన వారిపై తీసుకున్న వారిపై కూడా దృష్టి పెట్టాలని చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

కింది స్థాయిలోనే అర్జీలను ఇవ్వాలి

అర్జీదారులు తమ సమస్యలను ముందుగా గ్రామ స్థాయిలో లేదా మండల స్థాయిలో లేదా డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని పక్షంలో మాత్రమే జిల్లా స్థాయికి రావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఇచ్చిన అర్జీని గ్రామ స్థాయి లేదా మండల స్థాయి వారికే పంపిస్తాం కాబట్టి సమయం వృథా కాకుండా అర్జీదారు గ్రామ లేదా మండలం లేదా డివిజన్ స్థాయిలో సంప్రదించి పరిష్కారం కానప్పుడు మాత్రమే జిల్లా స్థాయిలో సమర్పించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 188 వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 35 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: పోలీస్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు సోమవారం 35 ఫిర్యాదులు అందాయి. జిల్లా అడిషనల్ ఏఎస్పీ సౌమ్యలత ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. మొత్తం వచ్చిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 12, కుటుంబకలహాలు 6, మోసాలకు సంబంధించి 3, ఇతర సమస్యలకు సంబంధించి 14 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సిబ్బంది సానుకూలంగా స్పందించాలని, చట్టపరిధిలో వాటిని పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేసేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

35 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

మెంటాడ: మండలంలోని పిట్టాడ చెక్ పోస్టు వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 35 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఆండ్ర ఎస్సై కె.సీతారాం తెలిపారు. సోమవారం వేకువ జామున మండలంలోని లొతుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి తన జూపిటర్ ద్విచక్ర వాహనంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. ఇదే వ్యక్తి 15 రోజుల క్రితం అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

వివాహిత హత్య కేసును ఛేదించిన పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన వివాహిత ఎర్రాప్రగడ వెంకటలక్ష్మి (38) హత్యకేసును ఎస్.కోట పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి సీఐ నారాయణమూర్తి సోమవారం రాత్రి అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి హత్యలో మృతురాలి కుమార్తె రుచిత ప్రమేయం ఉన్నట్లు చెప్పారు. ప్రణాళిక ప్రకారం తన తల్లిని ఇద్దరు స్నేహితులతో హత్య చేయించి గ్రామ సమీపంలోని నూతిలో తోయించినట్లు చెప్పారు. పూర్తి దర్యాప్తు నిమిత్తం కుమార్తె రుచితను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితురాలిని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. వెంకటలక్ష్మి మృతిపై కుమారుడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు.

గోవులపై వికృత చేష్టలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో గోవులపై వికృత చేష్టలకు పాల్పడి, గో హత్య చేసిన వ్యక్తిని పూసపాటిరేగ పోలీసులు ఎట్టకేలకు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..కొమరాడ మండలంలోని పెళ్లిగుడ్డి కంపవలసకు చెందిన నల్లిమిల్లి చంటి (45) ఉరఫ్ మల్లేష్ గోవులపై అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లేష్ కుమిలి సమీపంలో క్వారీలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుమిలిలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే రైతు ఆవుకు తాడుతో ఉరిపెట్టి వికృత చేష్టలకు పాల్పడుతుండగా ఆవు అరవడంతో గ్రామస్తులు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత నెలలో కుమిలి గ్రామంలో ఆవు రొమ్ములు, మర్మాంగాలు కోయడంతో ఆవు మృతి చెందిన విషయం విదితమే. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వ్యక్తి మల్లేష్ అని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. మూగజీవాలపై కిరాతకంగా వ్యవహరిస్తున్న మల్లేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి వేతనదారు మృతి

పాలకొండ రూరల్: మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండ గిరిజన గ్రామంలో ఉపాధి పనులకు హాజరైన పాలక సరోజిని(54) అకస్మాత్తుగా మృతిచెందింది. గ్రామంలోని ఊరచెరువులో ఉపాధి పనులకు కుమారుడు నారాయణరావుతో కలసి సోమవారం ఆమె వెళ్లింది. మస్తర్లు వేయించిన తరువాత యథావిధిగా వేతనదారులు పనులకు ఉపక్రమించారు. ఈ క్రమంలో సరోజిని అస్వస్థతకు గురై వాంతులు చేసుకుంది. విషయం గమనించిన సహచర వేతనదారులు, బాధితురాలిని కుమారుడితో పాటు ఇంటికి తరలించి, 108కు సమాచారం అందించారు. వాహనం చేరుకుని సిబ్బంది పరీక్షించి సరోజిని మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ ఎం.విజయరంగారావు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, క్షేత్ర సహాయకుడు బుల్లిబాబు మృతురాలి ఇంటికి వెళ్లి ఘటనపై ఆమె కుమారుడిని అడిగి తెలుసుకున్నారు, ఆ సమాచారం డ్వామా పీడీకి వివరించారు. మృతురాలికి భర్త పెంటయ్య ఉన్నాడు. గ్రామస్తులతో కలిసి పనులు చేస్తూ మృత్యువాత పడడంతో సహచర వేతనదారులు, గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.



సరోజిని(ఫైల్)

అమ్ముడు పోయిన ప్రజాస్వామ్యం

• బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌గా రాంబార్కి శరత్
• దగ్గరుండి కథ నడిపించిన ఎమ్మెల్యే బేబీనాయన,
• మాజీ మంత్రి సుజయ్

బొబ్బిలి: అధికార తాపత్రయం, అడ్డగోలుగానైనా పీఠం దక్కించుకోవాలనే కుటిల రాజకీయం వెరసి బొబ్బిలి మున్సిపల్ పీఠం టీడీపీ వశమైంది. గత నెల 29న అవిశ్వాస తీర్మానం నెగ్గిన తరువాత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎన్నికల పరిశీలకుడిగా హాజరైన ఈ ఎన్నిక ప్రక్రియను ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహన రావు నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఒక్కరి పేరే నామినేట్ చేస్తూ బీఫాం అందజేయడంతో సభకు ఆర్డీఓ వివరించారు. మున్సిపాలిటీలోని 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న రాంబార్కి శరత్ పేరును ఒక టీడీపీ కౌన్సిలర్ ప్రతిపాదించి, మరో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ (ఎన్నికకు ముందురోజే టీడీపీ కండువా కప్పారు) బలపరుస్తున్నట్లు వారి చేతే చెప్పించారు. కోరం కోసం అవసరమైన 16 మంది మాత్రమే హాజరయ్యారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ వైస్ చైర్మన్‌గా మొన్నటి వరకూ వ్యవహరించిన 19వ వార్డు కౌన్సిలర్ చెలికాని మురళీకృష్ణ కూడా హాజరయ్యారు.

చేతులెత్తే ప్రక్రియ అవసరం లేకుండానే..

చైర్మన్ ఎన్నికకు ఒకటే ప్రతిపాదన వచ్చిందని, మరెవరైనా పోటీ చేసే అవకాశం ఉందా అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సమక్షంలో ఆర్డీఓ రామమోహన రావు కౌన్సిలర్లను ప్రశ్నించారు. దీనికి ఎవరూ నోరు మెదపలేదు. మరోసారి అడిగి ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత రాంబార్కి శరత్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఆ వెంటనే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.



రాంబార్కి శరత్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీఓ, పక్కన జేసీ, కమిషనర్ తదితరులు

రేసులో ఉన్న కౌన్సిలర్‌తోనే ప్రతిపాదన

అవిశ్వాస రాజకీయంలో దించేసిన చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. ఈ సామాజిక వర్గానికే చైర్మన్ పదవి ఇస్తారని మొదటి నుంచి ప్రచారం సాగింది. అయితే కౌన్సిలర్లకు ఇవ్వాల్సిన, ఇతర ఖర్చుల కోసం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 6వ వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు భారీగా ఖర్చు చేశారని, ఆయన ఇప్పుడు రేసులో ఉన్నారని ప్రచారం సాగింది. అయితే దీనిని ఖండించని బేబీనాయన తదితరులు గుంభన రాజకీయాలు నడిపారు. చివరికి గెంబలి శ్రీనివాసరావు కూడా తనకు చైర్మన్ గిరీ ఇచ్చేందుకు బేబీనాయన హామీ ఇచ్చారని ఆయనే సుప్రీమ్ కనుక మరెవరు చెప్పినా జరిగే పనికాదని నాదే చైర్మన్ గిరీ అనీ ఢంకా భజాయించారు. చివరికి ఝంకలో ఇరుక్కుపోయారు. ఆయనకు ప్రస్తుత చైర్మన్ రాంబార్కి శరత్ చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడి పదవినిచ్చి మరోసారి చూద్దాంలే అని చివరి నిమిషంలో పక్కన పెట్టేశారు. అంతే కాదు. శరత్ చైర్మన్ కావడానికి సభలో నువ్వే ప్రతిపాదించాలని ఇరికించారు. దీంతో గెంబలి మరోసారి నిరుత్సాహ పడక తప్పలేదు. మరో కౌన్సిలర్ రామారావు గెంబలి ప్రతిపాదనను బలపర్చారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మున్సిపల్ చైర్మన్‌గా రాంబార్కి శరత్ కౌన్సిల్ హాల్‌లో బాధ్యతలు స్వీకరించారు.



హాజరైన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే బేబీ నాయన

హాజరు కాని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు:

బలం ఉన్నా టీడీపీ ఆడిన ప్రలోభాలు, పైరవీల వలలో పది మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చిక్కుకున్నారు. టీడీపీకి కేవలం పది మంది కౌన్సిలర్లే ఉన్నా ప్రలోభాలతో బలం పెరగడంతో ఎన్నిక లాంఛనమే అయింది. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఈ చైర్మన్ ఎన్నిక సమావేశానికి గైర్హాజరయ్యారు.

నీతి వదిలేసిన రాజకీయాలు



ప్రస్తుత రాజకీయాలు నీతిమాలిపోయాయి. కేవలం కొద్ది రోజుల పరిపాలన కోసం స్థానిక సంస్థలను కూడా కూటమి నాయకులు నిస్సిగ్గుగా చేజిక్కించుకునేందుకు బరితెగించడం సరికాదు. దమ్ముంటే సక్రమంగా రాజకీయాలు చేయాలి. అమ్ముకునే, కొనుగోలు చేసే రాజకీయాలు చేస్తే ప్రజలు తగిన జవాబిస్తారు. వచ్చే రోజుల్లో సరైన గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంటుంది.

శంబంగి వెంకట చిన అప్పలనాయుడు,
మాజీ ఎమ్మెల్యే

అనుకున్నది..అనుకున్నట్లే..!

• సర్వజన ఆస్పత్రిపై కూటమి సర్కార్ కుట్ర
• ఉన్న చోటే ఉంచే విధంగా మంత్రి శ్రీనివాస్ ఆదేశాలు
• వైద్యకళాశాల వద్దకు తరలించేందుకు నిరాకరణ
• వైద్య విద్యార్థులు, వైద్యుల అవస్థలు పట్టించుకోని ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విషయంలో కూటమి సర్కార్ అనుకున్న విధంగానే చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు వేసుకున్న స్కెచ్ ప్రకారమే ఏర్పాట్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఉన్నచోటే శాశ్వతంగా ఉంచాలని కూటమి సర్కార్ ప్రయత్నిస్తోంది. వైద్యవిద్యార్థులు, వైద్యులు కష్టాలను సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లా ప్రజల చిరకాల వాంఛను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేరవేర్చింది. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు ఎదురుచూశారు. కానీ ఎవరూ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయలేదు. 2019లో అధికారం చేపట్టిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేసింది. గాజులరేగ సమీపంలో 70 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు కాగా రూ. 500 కోట్లతో వైద్య కళాశాల, బోధనాస్పత్రి, హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు. కళాశాల మంజూరు చేయడంతో పాటు వైద్య కళాశాల ప్రారంభం కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసింది. మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు కూడా ప్రారంభించేశారు. 150 మంది వైద్య విద్యార్థులకు వైద్య కళాశాల రావడం వల్ల సీట్లు లభించాయి. రెండో ఏడాది తరగతులు కూడా జరుగుతున్నాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

1500 పడకలతో విశాలమైన భవనాల నిర్మాణం

గాజులరేగ వద్ద నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో బోధనాస్పత్రి కోసం సువిశాలమైన భవనాన్ని నిర్మించారు. అందులో 1500 బెడ్స్ (పడకలు) సరిపడేలా భవన నిర్మాణం జరిగింది. ప్రస్తుతం సర్వజన ఆస్పత్రి, ఘోషాఆస్పత్రిలో కలిపి 500 పడకలు మాత్రమే ఉన్నాయి. దీంతో రోగులు అధిక సంఖ్యలో రావడం వల్ల అవి చాలడం లేదు. ఫలితంగా రోగులకు వరండాలో బెడ్స్ వేసి చికిత్స అందించాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితులు ఉండకూడదనే ఉద్దేశంతో అక్కడ అధిక సంఖ్యలో బెడ్స్ పట్టేవిధంగా భవనాన్ని నిర్మిస్తున్నారు. అయినప్పటికీ కూటమి సర్కార్ ఉన్న చోటే, వసతులు చాలక పోయినా సర్వజన ఆస్పత్రిని ఇక్కడే ఉంచేవిధంగా పట్టుబట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్లాది రుపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తే అక్కడికి వైద్య కళాశాల తరలించబోమని కూటమి పాలకులు చెప్పడంపై జనం విస్తుపోతున్నారు.



ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న బోధనాస్పత్రి భవనం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి భవనాల ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్ (ఫైల్)

వసతులు చాలక అవస్థలు

ప్రస్తుత ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యులకు, యంత్ర పరికరాలు అమర్చేందుకు పూర్తిస్థాయిలో వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. అన్ని విభాగాలకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఒకటి రెండు విభాగాలకు ప్రొఫెసర్లు రావాల్సి ఉంది. గదులు చాలక ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఒకే గదిలో ఉండాల్సిన పరిస్థితి. ముఖ్యంగా యంత్ర పరికరాలు ఏర్పాటు చేయడానికి గదులు చాలక వైద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వైద్యవిద్యార్థుల అవస్థలు

వైద్య కళాశాలకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి సుమారు 5 కిలోమీటర్ల దూరం ఉండడంతో ప్రతిరోజూ వైద్య కళాశాల నుంచి వైద్య విద్యార్థులు ఆస్పత్రికి వస్తున్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రెండూ ఒకేచోట ఉంటే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రొఫెసర్లు కూడా వైద్య కళాశాలకు, సర్వజన ఆస్పత్రికి తిరగాల్సిన అవసరం ఉంటుంది. రెండూ ఒక చోట లేకపోవడం వల్ల వారు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. వారి అవస్థలను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్న చోటే ఉంచాలని మంత్రి ఆదేశాలు

జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉంది. అక్కడే ఆస్పత్రిని ఉంచేందుకు అవసరమైన అవకాశాలను పరిశీలించాలని, 15 రోజుల్లోగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు కూడా అదే పనిలో నిమగ్నమయ్యారు. అధికారం చేపట్టిన నాటి నుంచి కూటమికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఆస్పత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించకుండా ఇక్కడే ఉంచేందుకు నిర్ణయించారు. ఇప్పుడు బహిరంగగానే వారి ఆలోచనను బయట పెట్టేశారు.

• కంచర గెడ్డ

దురాక్రమణ



ఈ చిత్రం చూశారా... ఇది పొలం అనుకుంటే పొరపాటే. బొబ్బిలి మండలంలోని కాశిందొరవలస, నారాయణప్పవలస, గొర్లెసీతారాంపురం, తదితర గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించే కంచర గెడ్డ జలాశయం. బొబ్బిలి మండలం కాశిందొరవలస గ్రామ సమీపంలో 15 ఏళ్ల కిందట జలాశయాన్ని నిర్మించారు. దీని అభివృద్ధికి గత ప్రభుత్వం 253.05 లక్షల రూపాయలు మంజూరు చేసింది. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కనపెట్టేసింది. ఇదే అదునుగా స్థానిక టీడీపీ నాయకుడు జలాశయాన్ని పడమర వైపునుంచి ఇదిగో ఇలా ఆక్రమణకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే మూడు ఎకరాలు ఆక్రమించి పొలంగా మార్చేశాడు. సాగుకు సన్నద్ధమవుతున్నాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఇదే విషయంపై తహసీల్దార్ ఎం.శ్రీను మాట్లాడుతూ ఆక్రమణపై రైతులు ఫిర్యాదు చేశారన్నారు. పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

– బొబ్బిలి రూరల్